క్లుప్తంగా

క్యాన్సర్ బాధితుడికి రూ. 25 వేల సాయం



సంతోష్‌కుమార్‌కు సాయాన్ని అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: నందిగాం మండలం హరిదాసుపురం గ్రామానికి చెందిన ఆలవెల్లి సంతోష్ కుమార్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని పూండి వాసవీ కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం అండగా నిలిచింది. 25 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని సంఘ సభ్యులు హరిదాసుపురం గ్రామానికి ఆదివారం వెళ్లి బాధితుడికి అందజేసి ఆదర్శంగా నిలిచారు. సంఘం అధ్యక్షులు పొట్నూరు గోవిందరావు, ప్రతినిధులు కొంచాడ గోవిందరావు, వెంకటరావు, కెంగువ రాంబాబు, కె.రమేష్, బి.కేశవరావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షునిగా హరినారాయణ



వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షునిగా వజ్రపుకొత్తూరు మండలం రెయ్యిపాడు గ్రామానికి చెందిన మద్దిల హరినారాయణను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షునిగా సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా నిబద్ధతతో పని చేశారు. హరినారాయణ మాట్లాడుతూ: నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పొంచిఉన్న ప్రమాదం..



ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులోని జిల్లా ఆస్పత్రి సమీపంలో ఉన్న రహదారి మధ్యలో భారీ గొయ్యి ఏర్పడింది. గతంలో పైపులైన్లు వేసిన సమయంలో తవ్విన గోతులను సక్రమంగా కప్పలేదు. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీన్ని గమనించకుండా వెళ్తున్నవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గొయ్యిను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీశయన చైతన్యదీపిక కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

సోంపేట: శ్రీశయన చైతన్యదీపిక నూతన కార్యవర్గం ఎన్నికైంది. సోంపేటలో ఆదివారం సంఘ సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.వి.రామకృష్ణ, అధ్యక్షుడిగా దేవాడమోహనరావు, ప్రధాన కార్యదర్శిగా దుద్ది వీర్రాజు, గౌరవ సలహాదారునిగా దుద్ది శ్రీనివాసరావు, ముఖ్యసలహాదారునిగా డాక్టర్ వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బీన ఆనంద్, పాడుగు కామేష్ ఎన్నికయ్యారు.

శంకరరావు సేవలు ప్రశంసనీయం



శంకరరావు దంపతులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

కవిటి: ఉపాధ్యాయుడుగా, స్వచ్ఛందసంస్థ నిర్వాహకునిగా బల్లెడ శంకరరావు సేవలు ప్రశంసనీయమైనవని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బొరివంక గ్రామ పాఠశాలలో పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వృత్తివిద్యా ఉపాధ్యాయుడు, గెస్ట్ స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపకుడు శంకరరావు, శ్రావణి దంపతులను గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసి కార్యక్రమంలో దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశాఖపట్నం కృష్ణా కళాశాల రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ బి.రామకృష్ణ, బొరివంక పాఠశాల హెచ్ఎం ననపల రామకృష్ణ, జనసేన పార్టీ నాయకుడు దాసరి రాజు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, ఉపాధిహామీ పథకం ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతకు 'గుర్తింపు' గుబులు!

- ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసిన సర్కార్
- కౌలు రైతుల గురించి ప్రస్తావించని వైనం
- వేధిస్తున్న సర్వర్ సమస్య



సంతబొమ్మాళిలో రైతుల నమోదును పరిశీలిస్తున్న టెక్కలి ఏడీఏ బి.వి.తిరుమలరావు

సంతబొమ్మాళి: రైతులను కూటమి ప్రభుత్వం ఆందోళనకు గురిచేస్తోంది. రైతులందరూ విధిగా 11 అంకెల గుర్తింపు కార్డు తీసుకోవాలంటూ కొత్తగా మెలిక పెట్టింది. ఈనెలాఖరులోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఒత్తిడి ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అయితే సొంత భూములున్న రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్న ప్రభుత్వం కౌలు రైతులు గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం విమర్శలకు తావిస్తోంది. గుర్తింపు కార్డు ఉంటేనే బ్యాంకు రుణాలు, సబ్సిడీల వర్తింపు, పీఎం కిసాన్, పెట్టుబడి సాయం తదితర పథకాలు అందుతాయని ప్రభుత్వం చెబుతుంది. దీంతో వ్యవసాయ సిబ్బంది రైతు విశిష్ట గుర్తింపు కార్డు నమోదులో బిజీగా ఉన్నారు. అయితే సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడం, రైతులు కూడా అందుబాటులో లేక నమోదు ప్రక్రియ అలస్యమవుతోంది. పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

వలస బాటలో రైతులు..

ఈ ఏడాది ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలు వాతావరణం అనుకూలించక, తెగుళ్లతో దిగుబడులు పడిపోయాయి. పెట్టుబడులు సైతం చేతికిరాక, పండిన కాసింత పంట ధరల్లేక అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోయారు. కుటుంబ పోషణ కోసం పిల్లాపాపలతో ఇతర ప్రాంతాలకు చాలామంది వలస వెళ్లారు. ఇలాంటివారంతా రిజిస్ట్రేషన్ గడువు ఎక్కడ ముగిసిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో మండలాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ వివరాలు

మండలం	మొత్తం రైతులు	ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు
సంతబొమ్మాళి	10,779	8,686
టెక్కలి	8,365	7,377
కోటబొమ్మాళి	11,329	9,653
నందిగాం	9,998	9,104

రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందే..



విశిష్ట గుర్తింపు కార్డు నమోదును రైతులు విధిగా చేయించుకోవాలి. అయితే ఇంకా సమయం ఉన్నందున రైతులు ఆందోళనకు గురికావద్దు. పూర్తి వివరాలతో రైతులు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ప్రస్తుతం సొంత భూములున్నవారు తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

– బి.వి.తిరుమలరావు, ఏడీఏ, టెక్కలి

వైభవంగా శివలింగం పునఃప్రతిష్ట



పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: ముచ్చింద్ర గ్రామంలోని రత్నేశ్వర దేవాలయంలో శివలింగం పునఃప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా శుద్ధ, అగ్నిపూజలతోపాటు జవన్యాస ప్రతిష్ట పూజ కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్తు నరేంద్రయాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాంపత్ని చిట్టిబాబు, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్య, మండల పార్టీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖర్, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్, నర్తు వరప్రసాద్, దుక్క ధనలక్ష్మి, గుజ్జు ఢిల్లీరావు, నీలాపు సారధి, నాయకులు గురుమూర్తి, పిట్ట మామయ్య, ఇసురు తులసీరామ్, పిట్ల బాలరాజు పాల్గొన్నారు.

ఘనంగా డోలోత్సవం



లిటిల్‌స్టార్స్ బృందం డ్యాన్స్ ప్రదర్శన

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ చక్రధర పెరుమాళ్ స్వామి ఆలయంలో డోలోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేకువ జామున చక్రధర స్వామికి సుప్రభాతసేవ, నిత్యదర్శనాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శ్రీదేవీ భూదేవీ సమేత చక్రధరస్వామికి ఆలయ మాఢవీధులలో పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త పొందల శ్రీరాంబాబునాయుడు, సుప్రియ దంపతుల ఆర్థికసాయంతో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన లిటిల్‌స్టార్స్ బృందం ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మట్టిదిబ్బలను తొలగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా లొద్దపుట్టి ధనరాజు తులసమ్మ ఆయలం సమీపంలో ఈదుపురం వంతెన పరిసరాల్లో పొక్లయినర్లతో రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన ముళ్లపొదలు ఇసుకమేటలను ఆదివారం తొలగించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వీటిని తొలగిస్తున్నట్లు చెప్పారు.

సాహితీ సేవకునికి సత్కారం



సత్కారం పొందుతున్న కృష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన రచయిత, కళాకారుడు, జనజాగృతి సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలోని బాలాజీ కళామందిర్‌లో ఆదివారం జరిగిన రంగస్థల కళాకారుల సమాఖ్య 305వ కార్యక్రమంలో భాగంగా కవితాగానం చేశారు. కృష్ణమూర్తి సాహితీ సేవకులను గుర్తించి పౌరాణిక నటులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు చేతులమీదుగా సత్కారం పొందడంతోపాటు బహుమతి అందుకున్నారు.

మాజీమంత్రిని కలిసిన అనుబంధ విభాగాల నాయకులు



మాజీ మంత్రి అప్పలరాజును కలిసిన సంతోష్ తదితరులు

కాశీబుగ్గ: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో వివిధ పదవుల్లో నియమితులైన నాయకులు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును తన స్వగృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. అప్పలరాజును కలిసిన వారిలో పలాస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కన్వీనర్ బమ్మిడి సంతోష్ తదితరులున్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి సాయిచంద్రానగర్‌తో పాటు ఎన్‌టీఆర్ కాలనీ శివాలయం ప్రాంతాల్లో వీధి దీపాలు వేయాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో ఈప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగక పోవడంతో రాకపోకలు సాగించేవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు



బస్సుల కోసం ఎండలో పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

టెక్కలి: జాతీయ రహదారిలో కె.కొత్తూరు గ్రామ వద్ద బస్ షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ గ్రామం వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో ఎండలో, వానలో బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి బస్ షెల్టర్ నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం శ్రీరామ పాదుకా పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. త్రిదండి చినజీయర్ స్వామిజీ నేతృత్వంలో సాయంత్రం ఆరు గంటల నుంచి నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

రోడ్డుపైకి మురుగునీరు!



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి కొండపోలమ్మ కాలనీలో సరైన రోడ్లు, కాలువల్లేవు. కాలువ నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు వినియోగించే మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతుంది. దీంతో దోమలు విజృంభించడంతోపాటు పారిశుద్ధ్యం క్షీణిస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు, కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తుప్పలమధ్య విద్యుత్ కేంద్రం!



పిచ్చిమొక్కల మధ్య ఉపవిద్యుత్ కేంద్రం

కవిటి: బొరివంక గ్రామంలోని ఉపవిద్యుత్ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు దట్టంగా పేరుకుపోయాయి. దీంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాములు, విషకీటకాలు సంచరించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని సిబ్బందితోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రోన్ కెమెరాతో నిఘా



డ్రోన్ కెమెరాతో తీసిన ఛాయాచిత్రం

కంచిలి: మండల కేంద్రం పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపులా గల ప్రాంతాన్ని డ్రోన్ కెమెరాతో జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం పర్యవేక్షించారు. రహదారి పరిసరాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా డ్రోన్ కెమెరా సాయంతో గుర్తించేందుకు తమ సిబ్బంది సమాయత్తమైనట్లు స్థానిక ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. వారానికో రోజు డ్రోన్ కెమెరా పర్యవేక్షణ ఉంటుందన్నారు. నేరాల అదుపునకు ఈ పద్ధతి చాలా ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు.

చెత్త నిల్వలు లేకుండా చూడాలి

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి మెట్టవీధి జగద్ధాత్రిదేవి, శివాలయానికి ఆలయానికి ఎదురుగా చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులతో పాటు స్థానికులు కోరుతున్నారు. ఆలయానికి ఎదురుగా ఖాళీ స్థలంలో చెత్తతో పాటు వ్యర్థాలను వేస్తుండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫొటోలకే పరిమితం..



డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఇటీవల అధికారులు, కూటమి నాయకులు కలిసి స్వచ్ఛ దివస్ పేరుతో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. అయితే అది కేవలం ఫొటోలకే పరిమితమైందనే విషయం ప్రస్తుతం అక్కడ ఉన్న పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. ఆస్పత్రి ఆవరణలో ఒకే చోట చెత్త నిల్వలు వేసి వదిలేశారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమం కేవలం హడావుడి మాత్రమేనంటూ విమర్శలు వస్తున్నాయి.

–టెక్కలి

ఆర్థిక సాయం..



సంతబొమ్మాళి మండలం గోవిందపురం పంచాయతీ పంగజగ్గపేట గ్రామానికి చెందిన నీలాపే చిన్నమ్మి నిరుపేద. అనాథ కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న వల్లేవలస మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితురాలికి ఆదివారం అందజేసి అండగా నిలిచారు. అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, వసంతరావు మాస్టర్, ప్రసాద్ మాస్టర్, ఆనంద్ పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

జాడలేని పశువైద్యులు..



ఇచ్ఛాపురం మండలంలో అత్యధిక పాడి సంపద ఉన్న గ్రామం ఈదుపురం. మూగజీవాలకు వైద్యం అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో పశువైద్యాధికారిని నియమించారు. ఎన్నికల అనంతరం ఇక్కడ పని చేయాల్సిన పశువైద్యాధికారితో పాటు సిబ్బంది జాడ లేకుండా పోయింది. దీంతో పశువుల ఆస్పత్రి మూలకు చేరింది. పశు వైద్యం కోసం ప్రైవేటు వైద్యులను సంప్రదిస్తున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

ట్రాఫిక్ ఇక్కట్లు..



కోటబొమ్మాళి మండలం కన్నేవలస గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. భారీ ఐరన్ మోటర్‌ను తీసుకొని విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్తున్న భారీ వాహనం నెమ్మదిగా వెళ్లడం..పక్కనుంచి వెళ్లేందుకు కూడా స్థలం లేకపోవడంతో వెనుక నుంచి వచ్చిన వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సుమారు అర కిలోమీటర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఏదైన పార్కింగ్ స్థలం వస్తే తప్పా.. భారీ వాహనాన్ని తప్పించుకొని వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

–టెక్కలి రూరల్

శిక్షణ శిబిరం సందర్శన



శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న పీడీ ఎస్.వి.రమణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్లకు వ్యాపార అభివృద్ధిలో భాగంగా బ్యూటీషియన్, విద్యుత్ విభాగాలపై శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరాన్ని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.వి.రమణ ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిక్షణ తీసుకున్నవారి వివరాలను హోమ్ ట్రయాంగిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. అలాగే శిక్షణ పొందిన అందరికీ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పట్టణ సమైఖ్య అధ్యక్షురాలు టి.రాజ్యలక్ష్మి, కంప్యూటర్ శిక్షకులు జీవనరావు, సిటీ మిషన్ మేనేజర్ పన్నింటి మోహన్‌రెడ్డి ఉన్నారు.

తూర్పుకాపు సామాజిక వర్గం కార్యవర్గం



నూతన కార్యవర్గ ప్రతినిధులు

టెక్కలి: తూర్పు కాపు సామాజిక వర్గం నియోజకవర్గస్థాయి కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక కన్యకపరమేశ్వరి సత్రంలో కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ జరిగింది. అధ్యక్షునిగా పోలాకి వాసుదేవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.దివాకర్, ప్రధాన కార్యదర్శిగా తమిరె బలరాం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జె.రాంబాబు, వి.శ్రీను, బి.నరేంద్రచక్రవర్తి, గౌరవ అధ్యక్షులుగా మోదుగువలస గణపతిరావు, పోలాకి చంద్రశేఖర్, పి.లక్ష్మణరావు, ఎస్.లావన్న, బి.బుల్లినాయుడు, డి.తిరుపతిరావు, సలహాదారులుగా పి.షణ్ముఖరావు, ఆర్.ఆదినారాయణ, బి.మోహన్‌రావు, ఎస్.కృష్ణారావు, మహిళా విభాగం నుంచి అధ్యక్షులుగా వి.కిరణ్ కుమారి, సెక్రటరీగా రౌతు రాజేశ్వరితో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జాయింట్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, సోషల్ మీడియా ప్రతినిధులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభ్యులంతా నూతన కమిటీని అభినందించారు.